

# నవభూమి

## నల్లగొండ

అనుబంధం

25 ఫిబ్రవరి,2025 మంగళవారం పేజీలు:4

www.epaper.navabhoomi.in


### అంతర్రాష్ట్ర దొంగ

# దంపతుల అరెస్ట్

◆ 97.9 గ్రాముల బంగారం, సెల్ ఫోన్ స్వాధీనం





**మిర్యాలగూడ నవభూమి, ఫిబ్రవరి 24:-** మిర్యాలగూడ పట్టణంలోని సుందర్ నగర్ కు చెందిన అంతర్రాష్ట్ర దొంగలు దంపతులు వేముల కోటేష్, మాతంగి కృష్ణవేణి లను అరెస్టు చేసి వారి వద్ద నుండి 97.9 గ్రాముల బంగారం, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు టూ టౌన్ ఇన్స్పెక్టర్ పి.నాగార్జున, రూరల్ సీఐ కె.వీరబాబులు తెలిపారు. సోమవారం రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులను హాజరు పరిచి వివరాలు వెల్లడించారు. 2010 నుండి మిర్యాలగూడ పట్టణానికి చెందిన కోటేష్, కృష్ణవేణి దంపతులు దొంగతనాలు చేయడం ప్రారంభించారని, పగలంతా రెక్కీ నిర్వహించి రాత్రి సమయంలో ఇళ్లలో దొంగతనాలు చేయడం అలవాటుగా మారిందని అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలలోని వివిధ పోలీస్ స్టేషన్లో నిందితులపై 37 కేసులు నమోదైనట్లు తెలిపారు. 2024 మార్చి నెలలో వీరిని పలు కేసుల్లో కోర్టులో హాజరు పరచగా జ్యుడీషియల్ కస్టడీకి పోయి జులై నెలలో బయటికి వచ్చిన వీరు వివిధ ప్రాంతాలలో కూలి పనులు చేస్తూ బస్సుల్లో రైళ్లలో తిరుగుతూ పలుచోట్ల దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. సోమవారం పట్టణంలో దొంగతనం చేసేందుకు వచ్చారని, పోలీస్ పెట్రోలింగ్ వాహనాన్ని చూసి పారిపోతుండగా పట్టుకుని విచారణ చేయగా నేరం ఒప్పుకున్నారని అనంతరం అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుల నుంచి బంగారాన్ని సెల్ ఫోను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచిననట్టు తెలిపారు. కేసును చేదించిన మిర్యాలగూడ టూ టౌన్ ఇన్స్పెక్టర్ పి.నాగార్జున, రూరల్ సీఐ కె.వీరబాబు, ఎస్ఐ బి.రాంబాబు, ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, పిసిలు రామకృష్ణ, ఎండి.అక్బర్ లను మిర్యాలగూడ డిఎస్పి కె.రాజశేఖర్ రాజు ప్రత్యేకంగా అభినందించారు.





### నల్గొండ రీజియన్ పరిధిలో

# 136 ఈ - బస్సులు

◆ సిబ్బంది కార్మికులకు ఆరోగ్య పరీక్షలు

◆ ఆర్టీసీ నల్గొండ రీజినల్ మేనేజర్ జాన్‌రెడ్డి

**మిర్యాలగూడ నవభూమి, ఫిబ్రవరి 24:-** త్వరలోనే నల్గొండ రీజియన్ పరిధిలో 136 ఈ - బస్సులు ( ఎలక్ట్రికల్ బస్సులు) నడుస్తాయని నల్లగొండ రీజినల్ మేనేజర్ కె.జాన్‌రెడ్డి తెలిపారు. సోమవారం మిర్యాలగూడ డిపోలో పవర్ డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందికి నిర్వహించిన శిక్షణ, అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నల్గొండ రీజియన్ కు 72 ఈ - బస్సులు సూర్యాపేట జిల్లాకు 64 ఈ - బస్సులు మంజూరు అయ్యాయని ఆయన తెలిపారు. నల్గొండ, సూర్యాపేటలో ఆర్టీసీ పరిధిలోని ఎలక్ట్రికల్ బస్సు ఛార్జింగ్ స్టేషన్లు ప్రారంభించిన వెంటనే నల్గొండ, సూర్యాపేట జిల్లా కేంద్రల నుంచి వివిధ ప్రాంతాలకు ఈ - బస్సులు నడపనున్నామని తెలిపారు. ప్రతి సంవత్సరం ఆర్టీసీ సిబ్బంది, కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 13 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేస్తున్నామని ఆయన వివరించారు. డ్రైవర్ కండక్టర్లకు సంబంధించి ప్రతి 15 రోజులకు ఒకసారి ఆరోగ్యం సంబంధించిన రిపోర్టు తెలుసుకొని మెడిసిన్ అందజేస్తారన్నారు. నల్గొండ రీజియన్ పరిధిలోనీ 7 డిపోలలో 1,750 మంది డ్రైవర్ కండక్టర్లు గ్యారేజ్ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. కోదాడ ఆర్టీసీ డిపో నుండి మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మట్టంపల్లి, మెల్లచరువు తదితర పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని అదేవిధంగా మిర్యాలగూడ డిపో నుంచి వాడపల్లి, సోమారం సోమప్ప దేవాలయాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే ఆర్టీసీ సంస్థ లక్ష్యమని అన్నారు. సోమవారం మిర్యాలగూడ ఆర్టీసీ డిపో పరిధిలో పవర్ డ్రైవర్ కండక్టర్ సిబ్బందికి నిర్వహించిన శిక్షణ తరగతులలో ఆయన హాజరై ప్రయాణికులతో ఎలా మెలగాలి తదితర అంశాలపై అవగాహన కల్పించామని తెలిపారు. ప్రయాణికులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించడంతోపాటు ఆర్టీసీ సంస్థను అభివృద్ధి దిశలో ముందు తీసుకెళ్లేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామన్నారు. ప్రతి సంవత్సరం ఆర్టీసీ సిబ్బంది కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 13 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేస్తున్నామన్నారు. డ్రైవర్లు, కండక్టర్లకు సంబంధించి ప్రతి 15 రోజులకు ఒకసారి ఆరోగ్యం సంబంధించిన రిపోర్టు తెలుసుకొని మెడిసిన్ అందజేస్తారని ఆయన తెలిపారు. నల్గొండ రీజియన్ పరిధిలో 7 డిపోలలో 1750 మంది డ్రైవర్ కండక్టర్లు గ్యారేజ్ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. కోదాడ ఆర్టీసీ డిపో నుండి మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మట్టంపల్లి తదితర పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని అదేవిధంగా మిర్యాలగూడ డిపో నుంచి వాడపల్లి క్షేత్రశాల సోమప్ప దేవాలయాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆయన వివరించారు. సమావేశంలో మిర్యాలగూడ డిపో మేనేజర్ రామ్మోహన్ రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ భారతిబాయి ఉన్నారు.



## మృతుడి కుటుంబానికి పూర్వ విద్యార్థుల ఆర్థిక సహాయం



ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

**భూదాన్ పోచంపల్లి నవభూమి** భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రానికి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్ఎస్సి బ్యాచ్ 1992-1993 పూర్వ విద్యార్థులు తమ తోటి విద్యార్థి మెహర్ నగర్ గ్రామానికి చెందిన ఆకుల మోహన్ ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబానికి మిత్రులంతా కలిసి 40 వేల రూపాయలను పోగుచేసి సోమవారం కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్సి బ్యాచ్ అధ్యక్షుడు మైల ఐలయ్య, గౌరవ అధ్యక్షులు సురకంటి జంగారెడ్డి, గౌరవ సలహాదారుడు కాసుల నరసింహ, ప్రధాన కార్యదర్శి యాట సత్యనారాయణ, కోశాధికారి దోర్నాల గణేష్, గోకుల మోహన్, బొక్క భగవంతు రెడ్డి, గుద్దేటి నరసింహ, మేకం పాండు తదితరులు ఉన్నారు

## దశదిన కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రెస్ క్లబ్ సభ్యులు

**గరిడేపల్లి నవభూమి** ప్రెస్ క్లబ్ మిత్రులు సీనియర్ పాత్రికేయులు నమస్తే తెలంగాణ రిపోర్టర్ తాటికొండ లక్ష్మణ్ నాన్న తాటికొండ వెంకటయ్య దశ దిన కార్యక్రమాల్లో భాగంగా గరిడేపల్లి ప్రెస్ క్లబ్ మిత్రులు పాల్గొని తాటికొండ వెంకటయ్య ఫోటోకు పూలమాలతో శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ జిల్లా నాయకులు పైడిమర్రి రంగనాథ్, మాజీ జెడ్పిటిసి పెండెం శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కడియం వెంకట్ రెడ్డి, వాసవి క్లబ్ అధ్యక్షులు గేల్లి సతీష్, పలువురు మండల ప్రముఖులు, గరిడేపల్లి మండల ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కడారు వెంకటేశ్వర్లు, శివ, సీనియర్ రిపోర్టర్ గురవయ్య, భిక్షం, గోరంట్ల శ్రీనివాస్,ఉపేందర్, కుర్ర గోపి, సుందరయ్య, షేక్ అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.





### దొడ్డమోని చంద్రం ఆశయ సాధనకు

# ప్రతి ఒక్కరం కృషి చేయాలి

◆ చంద్రం యాదవ కుటుంబానికి అండగా నిలబడతాం ◆ మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి









**భూదాన్ పోచంపల్లి నవభూమి** తెలంగాణ ఆశయ సాధన కోసం దొడ్డమోని చంద్రం చేసిన సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి అన్నారు.పురపాలక కేంద్రంలోనీ జెవి ఫంక్షన్ హాల్ లో సోమవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుడు దొడ్డమోని చంద్రం యాదవ్ ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు కంచర్ల భూపాల్ రెడ్డి, మాజీ జెడ్పి చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి క్యామ మల్లేశం తో కలిసి ఆయన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా దొడ్డమోని చంద్రం యాదవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు అనంతరం ఆయన పేరు రాసిన పాటలసిడిని వారు ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ చంద్ర మృతి బిఆర్ఎస్ పార్టీకి తీరని లోటని ఆయన అన్నారు. తెలంగాణ ఆశయ సాధన కోసం తాను పోషించిన పాత్ర మరువలేనిదని ఆయన కొనియాడారు .కాగా అనంతరం అధికారములోకి వచ్చాక పార్టీ బలోపేతం కోసం ఎంతగానో కృషి చేసిన వ్యక్తి చంద్రం యాదవ్ అని ఆయన తెలిపారు. ని గర్వి నిడంబరత్వం ముక్కుసూటి తనం తప్ప నైజంగా ఉన్నన్ని రోజులు అందరి నోళ్ళలో తాను ఒక్కడైన వ్యక్తి చంద్రం యాదవ అని ఆయన అన్నారు. సమాజ సేవ తన లక్ష్యంగా బతికిన వ్యక్తి చంద్రం యాదవ్ అని ఆయన అన్నారు. బ్రతకంలో ఉన్నన్ని రోజులు చంద్రం పార్టీ కృషి కోసమే బ్రతికిన వ్యక్తిగా చిరకాలం గుర్తుండిపోతారని ఆయన కలలుగన్న ఆశయన సాధనలో మనమందరం కృషి చేయాలని కోరారు. కాగా వారి కుటుంబానికి బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటూ ఆదుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలో మాడుగుల ప్రభాకర్ రెడ్డి, సారా సరస్వతి బాలయ్య గౌడ్,యాదవ సంఘం రాష్ట్ర నాయకులు అయోధ్య యాదవ్,పిఏసిఎస్ చైర్మన్ కాందాడి భూపాల్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి కోట పుష్పలత మల్లారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేష్ యాదవ్, నాయకులు రావుల శేఖర్ రెడ్డి, మండల, పట్టణ శాఖ అధ్యక్షులు పాటి సుధాకర్ రెడ్డి ,సీతా వెంకటేష్, ప్రధాన కార్యదర్శిలు చిలువేరు బాల నరసింహ, గునిగంటి మల్లేష్ గౌడ్, మాజీ సర్పంచ్ల ఫోరమ్ అధ్యక్షుడు సామ రవీందర్ రెడ్డి,నాయకులు కందడి సుధాకర్ రెడ్డి, ముత్యాల మైపాల్ రెడ్డి , పగిళ్ల సుధాకర్ రెడ్డి,నోముల మాధవరెడ్డి ,బత్తుల శ్రీశైలం గౌడ్, సామల మల్లారెడ్డి, పగిళ్ల రాంరెడ్డి ,కట్ట భవాని శేఖర్ రెడ్డి, యువ నాయకులు చింతకింది కిరణ్, వేముల సుమన్ శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

## సెట్ బ్యాక్ లేకుండా ఉన్న నిర్మాణాన్ని తొలగించిన మున్సిపల్ అధికారులు

**మిర్యాలగూడ నవభూమి ఫిబ్రవరి 24:-** మిర్యాలగూడ పట్టణం కృష్ణా కాలనీ సమీపంలో హ్యాపీ హోమ్స్ నిర్మాణంలో తేడా రావడంతో సెట్ బ్యాక్ లేకపోవడంతో రోడ్డుపైకి వచ్చిన నిర్మాణాన్ని సోమవారం టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించినట్టు మున్సిపల్ కమిషనర్ ఎండీ. యూసుఫ్ తెలిపారు. అమోదం పొందిన ప్లాన్ ప్రకారం కాకుండా రోడ్డు పైకి వచ్చి ఇంటి నిర్మాణం చేస్తున్నారని ఫిర్యాదు రావడంతో తొలగించామని తెలిపారు. అదేవిధంగా సాగర్ రోడ్డుపై ఉన్న తోపుడు నిర్వాహకుడు సురేష్ కుమార్ ను డ్రైనేజ్ వెనుక పెట్టాలని పెట్టుకుంటే తొలగిస్తామని చెప్పినట్టు తెలిపారు అతనిపై రూ.2,000 జరిమాన వేసినట్టు తెలిపారు. రోడ్డుపై ఉన్న తోపుడు బండ్లు, చిన్న దుకాణాలు తొలగిస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట టిపిఓ సోమయ్య, టీపిఎస్ అంజయ్య లున్నారు.



## సాగు నీళ్లు లేక అన్నదాత అరిగోస

**యాసంగి నవభూమి** యాసంగిలో సాగు చేసిన పంటలకు నీటి తడులు అందించలేక అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. చేతికి వస్తుందన్న పంట కండ్ల ముందే ఎండిపోతుండడంతో రైతులకు భంగపాటు తప్పడం లేదు. భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటగా, బోర్లలో నీళ్లు లేక, ఎస్సారె-స్పీ కాల్వల ద్వారా సాగు నీరు రాక రైతులు గోస పడుతున్నారు. రైతు భరోసా ఇవ్వక పంట పెట్టుబడులకు వ్యాపారుల దగ్గర అప్పులు తెచ్చినా, పెట్టిన పెట్టుబడులు సైతం రాక దుర్భర పరిస్థితిలో రైతన్నలు ఉన్నారు.300 ఎకరాల్లో ఎండిన వరి నూతనకల్ మండలంలో ఈ యాసంగిలో మొత్తం 12,087 ఎకరాల్లో వరి సాగు చేశారు. సన్న వడ్లు 1,575 ఎకరాల్లో, దొడ్డ వడ్లు 10512 ఎకరాల్లో వేసినట్లు అధికారులు తెలిపారు. మండల పరిధిలోని మాచనపల్లి, లింగంపల్లి, నూతనకల్, ఎర్రపహాడ్, దిర్శనపల్లి, చిల్పకుంట్ల, మిర్యాల, అల్లునూరు గ్రామాల్లో సుమారు 300 ఎకరాల్లో నీళు లేక పంటలు ఎండిపోతున్నాయి. పొట్ట దశలో ఉన్న వరి ఎండిపోతుండడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. చేసేదేమీ లేక పశువులు, గొర్రెలు, మేకలకు మేతగా వదిలేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పూర్తి స్థాయిలో గోదావరి జలాలు విడుదల చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.పొట్ట దశలో ఎండిపోతున్నది నాకు ఊరి శివారులో మూడు ఎకరాల భూమి ఉంది. 60 వేల రూపాయల పెట్టుబడి పెట్టి వరి సాగు చేసిన. పొలం పొట్ట దశలోకి వచ్చింది. బోరు సరిగా పొయ్యడం లేదు.

## అనిత ఆశయాలు సాధించాలి



**కోదాడ ఫిబ్రవరి 24 (నవభూమి ప్రతినిధి)** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణ త్యాగం చేసిన అనిత ఆశయాలు సాధించాలి అని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి అన్నెం పాపిరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని రామలక్ష్మి పురం గ్రామానికి చెందిన అన్నెం అనిత 14వ వర్ధంతి సందర్భంగా , కాంగ్రెస్ సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో అనిత చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించి మాట్లాడారు. తెలంగాణ కోసం ప్రాణ త్యాగం చేసిన అనితను గుర్తు చేసుకుంటూ తెలంగాణ కోసం ప్రాణ త్యాగం చేసినటువంటి అనిత స్మృతులు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు అన్నెం నరసింహారెడ్డి, సంజీవరెడ్డి ,రాములు, రామసీతమ్మ , మాధవరెడ్డి, సైదిరెడ్డి ,శంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు .

## దుబ్బ తండలో బొడ్రాయి ప్రతిష్టాపన మహోత్సవం

**పెన్‌పహాడ్, ఫిబ్రవరి 24( నవభూమి)** పెన్ పహాడ్ మండల పరిధిలోని దుబ్బ తండా గ్రామపంచాయతీలో నాలుగు రోజులుగా బొడ్రాయి ప్రతిష్టాపన ఉత్సవాలు ఘనంగా జరిగినాయి. సోమవారం ఉదయం 11 గంటలకు వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ బొడ్రాయిని ప్రతిష్ఠించారు. గ్రామపెద్దల సమక్షంలో వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అగ్నిప్రతిష్ఠాపర, చండీహోమం, బొడ్రాయి ఊరేగింపు, అభిషేకం తదితర కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. అనంతరం మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు గ్రామ పొలిమేరలలో కట్టు పోశారు. మూడు వేల మందికి పైగా ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులు, మహిళలు, చిన్నారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.









### భ్రమరాంబిక సమేత శ్రీరామలింగేశ్వర స్వామి

# దేవాలయంలో శివరాత్రి వేడుకలు

- కాకతీయ రాజుల కాలం నాటి ప్రాచీన దేవాలయం
- నేటి నుండి తొగర్రాయి మహాశివరాత్రి వేడుకలు ప్రారంభం



**కోదాడ ఫిబ్రవరి 24(నవభూమి ప్రతినిధి)** మండల పరిధిలోని తొగర్రాయి గ్రామంలో వేంచేసియున్న ప్రాచీన భ్రమరాంబిక సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో శివరాత్రి వేడుకలు నేటి నుండి ప్రారంభిస్తున్నట్లు దేవాలయ అధ్యక్షులు యాదా శ్రీనివాసరావు, కార్యదర్శి నందుల లక్ష్మీ నరసింహ శాస్త్రి తెలిపారు. సోమవారం మహాశివరాత్రి కి సంబంధించిన కరపత్రణ ఆవిష్కరించి వారు మాట్లాడారు. వందల సంవత్సరాల చరిత్ర కల్గి కాకతీయ రాజుల కాలంలో నిర్మించబడిన శ్రీ భ్రమరాంబికా సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానము అతి ప్రాచీనమైనది అన్నారు. శ్రీశైలంలో వెలసివున్న అష్టాదశ శక్తులలో ఒకరైన శ్రీ భ్రమరాంబిక అమ్మవారు, ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకరైన రామేశ్వరం (సేతుబంధం)లోని రామలింగేశ్వరుడికి ప్రతిరూపాలుగా వేంచేసియున్నారు అని తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా నేటి నుండి జరుగు కార్యక్రమాల గురించి తెలిపారు. నేడు గణపతి పూజ, పుణ్యాహవాచనం, దీక్షాధారణ, అంకురారోపణ, ధ్వజారోహణ జరుగుతాయి. ఫిబ్రవరి 26, బుధవారం మహాశివరాత్రి తెల్లవారుజాము నుండి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, ఉత్సవమూర్తులకు నవ కలశ స్నపనం, రుద్ర హోమం. అదే రోజు రాత్రి 8 గంటల నుండి దివిటీ ఉత్సవం, జ్వాలా తోరణం, ఎదుర్కోలు, వేద పండితుల చేత శివపార్వతుల కళ్యాణ మహోత్సవం జరుగును. ఫిబ్రవరి 27, గురువారం నాడు నవగ్రహ హోమం, చండి హోమం, రుద్ర హోమం, దుర్గా హోమం,మహా పూర్ణాహుతి జరుగుతాయి. ఫిబ్రవరి 28 శుక్రవారం కళ్యాణ మూర్తుల నంది వాహన సేవ, గ్రామంలో ఊరేగింపు మహోత్సవం జరుగుతుంది. మార్చి 1, శనివారం నాడు పవళింపు సేవ, భజన కార్యక్రమం జరుగుతుంది అని తెలిపారు. ఈ ఉత్సవాలు సంబంధించిన సకల ఏర్పాట్లు, దేవాలయం రంగులతో ముస్తాబు చేయటం పూర్తి అయిందని, భక్తుల సౌకర్యార్థం మంచి నీటి వ్యవస్థ, ప్రసాదాలు ఏర్పాటు చేస్తున్నట్లు దేవాలయ కమిటీ చైర్మన్ యాదా శ్రీనివాసరావు తెలిపారు. రుద్రాభిషేకాలు, రుద్ర హోమము కల్యాణోత్సవంలో పాల్గొనేవారు దేవాలయ అర్చకులు రెంటాల పుల్లేశ్వర శర్మను సంప్రదించవలసినదిగా తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో అర్చకులు పులేశ్వర శర్మ, విష్ణువర్ధనాచార్య, మాజీ సర్పంచ్ దొంగల లక్ష్మీనారాయణ, దేవాలయ కమిటీ సభ్యులు నందుల లక్ష్మీనరసింహశాస్త్రి, మునగ మధు, అమరబోయిన ఎర్రయ్య, నాగరాజు, యాదగిరి, గోపి, యాదా రమేష్, జూలూరి వెంకన్న చారి తదితరులు పాల్గొన్నారు.





# అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి, మరొకరి పరిస్థితి విషమం

- కల్తీ మద్యమా? కల్తీ ఆహారమా.. కుట్రనా?
- మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ వన్ టౌన్ పోలీసులకు భార్య ఫిర్యాదు





**మిర్యాలగూడ నవభూమి, ఫిబ్రవరి 24:-** రాత్రి మద్యం సేవించిన మిత్రులలో రక్తపు వాంతులతో ఒకరు మృతి చెందగా మరొకరు కొన ఊపిరి తో పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అనుమానాస్పద సంఘటన మిర్యాలగూడ పట్టణంలో సోమవారం వెలుగు చూసింది. భర్త మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ భార్య ఒన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. బాధితులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. పట్టణంలోని వినోబానగర్ కు చెందిన కోడి రెక్క సంపత్ కుమార్ (32) ప్రైవేట్ సంస్థలో ఫైనాన్స్ రికవరీ ఏజెంట్ గా పని చేస్తుంటాడు. ఆదివారం రాత్రి అతని మిత్రులు ఆర్ఎంపీ డాక్టర్ అయిన ఎండి గౌస్ అలీ, రెడ్డి మాస్ యశ్వంత్, గురజాల బాలరాజు, పొదిళ్ల అన్వేష్ లు కలిసి ముత్తిరెడ్డికుంటలోని ఓ బెల్ట్ షాపులో మద్యం సేవించినట్టు తెలిపారు. అనంతరం కోడిరెక్క సంపత్, గౌస్ అలీలు అర్ధరాత్రి విపరీతంగా రక్తపు వాంతులు చేసుకోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు తొలుత మిర్యాలగూడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి, ఆపైన మిర్యాలగూడలోని ప్రైవేట్ ఆస్పత్రిలలో చేర్పించారు. చికిత్స పొందుతూ కోడిరెక్క సంపత్ సోమవారం మృతి చెందగా, గౌస్ అలి అపోలో ఆసుపత్రిలో వెంటిలేటర్ పై చికిత్స పొందుతున్నాడు. కాగా సంపత్ కుమార్ మృతిపై భార్య రమ్య పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ ఒన్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. తన భర్త తాగింది కల్తీ మద్యమై ఉండవచ్చని, లేదా ఎవరైనా పథకం ప్రకారం వారిపై ఏదైనా చేసి ఉండవచ్చని అభిప్రాయం వ్యక్తం చేస్తుంది. రమ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఒన్ టౌన్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

# విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

## మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కోడి లింగయ్య




**పెన్‌పహాడ్, ఫిబ్రవరి 24( నవభూమి)**విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కోడి లింగయ్య అన్నారు. మండల పరిధిలోని అనాజిపురం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ కోడి లింగయ్య తెలిపిన వివరాల ప్రకారం. ఈనెల 20 నుండి 23 వరకు తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో వికారాబాద్ లో 34వ సబ్ జూనియర్ ఇంటర్ డిస్టిక్ కాబట్టి ఛాంపియన్షిప్ స్టేట్ మీట్ ఎంపికై కబడ్డీ పోటీలు ఆటలు ఆడడం జరిగింది. ఇంటర్ ఫస్టియర్ సిఇసి గ్రూప్ విద్యార్థులు బి దుర్గాప్రసాద్, శ్రీ సాయిరాం షీల్డ్,ప్రశంసలు అందుకున్నారు. అలాగే ఆదర్శ పాఠశాల ఇంటర్ విద్యార్థు లు శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి దేవస్థానం అర్వపల్లి వారు నిర్వహించిన బ్రహ్మోత్సవాలు కబడ్డీ పోటీలో కబడ్డీ సెకండ్ ప్రైజ్ 20,000 తెలంగాణ మోడల్ స్కూల్ అనాజిపురం విద్యార్థులు అందుకున్నారు. కెప్టెన్ శివారెడ్డి, వినయ్, మహేష్ యోగానంద ఈ కార్యక్రమంలో పిడి నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్ గురు చరణ్ మరియు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# గుర్తు తెలియని లారీ ఢీకొనడంతో ఒకరి మృతి



**మిర్యాలగూడ, దామరచర్ల నవభూమి,ఫిబ్రవరి 24:-** దామరచర్ల మండలంలోని వాడపల్లి శివారు హర్యానా దాబా వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని లారీ ఢీకొనడంతో శంకరశెట్టి వెంకట చంద్రశేఖరరావు (38 ) మరణించారు . పోలీసులు, స్థానికుల వివరాల మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం శ్రీనగర్ చెందిన లారీ డ్రైవర్ గా పనిచేస్తున్న మృతుడు చంద్రశేఖరరావు తన మోటార్ సైకిల్ పై ఇంటి నుండి దామరచర్ల మండల కేంద్రం వైపు వస్తుండగా, ఆంధ్రప్రదేశ్ నుండి మిర్యాలగూడ వైపు వస్తున్న గుర్తుతెలియని కంటైనర్ లారీ అతివేగంగా, అజాగ్రత్తగా వస్తూ చంద్రశేఖర్ బైకును వెనుక నుండి బలంగా ఢీకొట్టడంతో కిందపడిపోగా అతనిపైనుండి లారీ వెళ్లడంతో తీవ్ర గాయాలతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న వాడపల్లి పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ పి.హరినాథ్ తెలిపారు.

# రేషన్ షాపు డీలర్లు సమయపాలన పాటించాలి

## తహసీల్దార్ హరిబాబు



**మిర్యాలగూడ నవభూమి ఫిబ్రవరి 24:-** ప్రజాపంపిణీ వ్యవస్థ మెరుగు పరచడానికి చౌకధరల (రేషన్ షాపు డీలర్లు)దుకాణదారులు సమయ పాలన పాటించాలని స్థానిక తహసీల్దార్ ఎన్. హరిబాబు కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన దుకాణాల డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి దుకాణంలో స్టాక్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. దుకాణదారులు స్టాక్ రిజిస్టర్లు పకడ్బందీగా నిర్వహించాలని ఆయన కోరారు. ఈ పాస్ మిషన్ ద్వారానే అమ్మకాలు చేయాలని కోరారు. తూకం వెయింగ్ మిషన్లతోనే వేయాలని సలహా ఇచ్చారు. దుకాణాలను అధీకృత అధికారితో రెన్యువల్ చేయించుకోవాలని ఆయన తెలిపారు. దుకాణాలను సక్రమంగా నిర్వహించాలని ఆయన అన్నారు. అధికారులు తనిఖీలు జరిపే సమయంలో సహకరించాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ రజినీకాంత్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ ఠాకూర్ రామకృష్ణలున్నారు.

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకోవాలని

# డిఆర్ఓకు టి డబ్ల్యుజెఎఫ్ వినతి

**మిర్యాలగూడ నవభూమి, ఫిబ్రవరి 24:-** జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నల్లగొండ జిల్లా రెవిన్యూ అధికారి అశోక్ రెడ్డికు వినతిపత్రం టిడబ్ల్యుజెఎఫ్ నాయకులు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు ఎండీ. అయూబ్ మాట్లాడుతూ . జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు, అక్రెడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, పెన్షన్ స్కీం, దాడుల నివారణకు ప్రత్యేక కమిటీల ఏర్పాటు, చిన్న, మధ్య తరహా పత్రికలకు ప్రభుత్వ గుర్తింపు, జర్నలిస్టుల ప్రత్యేక రక్షణ చట్టం డిమాండ్ల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో తీవ్ర నిర్లక్ష్యం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఇంత వరకు ఏ ఒక్క సమస్యనూ పరిష్కరించలేదన్నారు. జర్నలిస్టులకు కొత్త అక్రెడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు ఇవ్వకుండా జీవో 239 సమీక్ష, సవరణ కమిటీ పేరుతో కాలయాపన చేస్తున్నదన్నారు. దీంతో జర్నలిస్టులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి రాగానే జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలిస్తామని గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు సుప్రీంకోర్టు తీర్పును సాకుగా బిచూపి జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నదన్నారు.జిల్లా



వ్యాప్తంగా ఈనెల ఫిబ్రవరి 25 నుంచి మార్చి 25 వరకు నెల రోజుల పాటు ఫెడరేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం సీనియర్ నాయకులు ఖాజా హమీదోద్దీన్, జాతీయ కౌన్సిల్ సభ్యులు జీ.మహేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకన్న, జిల్లా కోశాధికారి కె.నాజీముద్దిన్, సాదత్ అలీ, వరుణ, శేఖర్ రెడ్డి, అరుణ్ కుమార్, ఇబ్రహీం, సైదులు, మిర్యాలగూడ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు మంద సైదులు, జయరాజు, నరేష్, రాంప్రసాద్, నరసింహ, నక్క శ్రీను, డి. శ్రీను నాయక్, బంటు సైదులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

## స్వర్ణమయం..

# దివ్య విమాన వైభవం

**యాదగిరిగుట్ట-నవభూమి, :** యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్య విమానగోపురం స్వర్ణకాంతుల్లో ఆవిష్కృమైంది. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సంకల్పం నెరవేరింది. గత ప్రభుత్వ హయాంలో సీఎం, మంత్రులు, ఇతర ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల నుంచి సేకరించిన బంగారం విరాళంతోపాటు దేవస్థాన ఖజానాతో కొనుగోలు చేసిన 68 కేజీల బంగారంతో దివ్య విమానగోపురాన్ని స్వర్ణమయం చేశారు. దివ్య విమానగోపుర మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవానికి ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దంపతులు హాజరై ఆవిష్కరించారు. ఉదయం 11.22 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యతో కలిసి యాదగిరిగుట్టకు చేరుకున్నారు. కొండపైన ఉత్తర మాఢవీధుల్లో జరిగిన పంచకుండాత్మకమహా పూర్ణాహుతిలో పాల్గొన్నారు. ఉత్తర పంచతల రాజగోపురం నుంచి ఆలయంలోకి ప్రవేశించారు. అక్కడి నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పరంజా సహాయంతో దివ్య స్వర్ణ విమానగోపురం వద్దకు చేరుకున్నారు.ఆలయ ప్రధానార్చకులు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, వానమామలై మఠం 31వ పీఠాధిపతులు రామానుజ జీయర్ స్వామి సూచనలతో మహాకుంభాభిషేక ప్రతిష్ఠా మహోత్సవం వైభవంగా సాగింది. ఈ సందర్భంగా ఆలయ ముఖ మండపంలో ప్రధానార్చకులు సీఎం దంపతులకు చతుర్వేద ఆశీర్వచనం చేయగా దేవదాయ ధర్మదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యార్ స్వామివారి ప్రసాదం, చిత్రపటం బహూకరించారు. సాయంత్రం దివ్య విమానగోపుర మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవాలను అర్చకులు పరిపూర్ణం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మందుల సామేలు, వేముల వీరేశం, నేనావత్ బాలూనాయక్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, శ్రీనివాసరాజు, చీఫ్ సెక్రటరీ శాంతికుమారి, కలెక్టర్ హనుమంతరావు, వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు, కమిటీ సభ్యులు మోహన్‌రావు, ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహ మూర్తి, ఈఓ భాస్కర్‌రావు, డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, ఆలయ ప్రధానార్చకుడు కాండూరి వేంకటాచార్యులు, శోభారాణి, గోవిందహరి తదితరులు పాల్గొన్నారు.చెప్పులతో ఆలయంలోకి కాంగ్రెస్ నాయకులు దివ్య విమానగోపుర మహాకుంభాభిషేక సంప్రోక్షణలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు నానా హంగామా చేశారు. విమాన గోపురంపైకి వెళ్లేందుకు పరిమిత సంఖ్యలో అనుమతినిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు పైకి వెళ్లేందుకు సెక్యూరిటీ సిబ్బందితో వాగ్వాదం చేశారు. పలువురు నాయకులు తిరుమాఢ వీధుల్లో చెప్పులతోనే సంచరించారు. చెప్పులు వేసుకునే ఆలయంలోకి ప్రవేశించారు.వైటీడీఏ డిప్యూటీ స్తపతికి అవమానం దివ్య విమానగోపుర మహాకుంభాభిషేక మహోత్సవంలో ఒక స్తపతిని ఈఓ భాస్కర్‌రావు అవమాన పరిచారు. 'మిమ్మల్ని పిలువ లేదు.. నీవు రావొద్దు' అంటూ వైటీడీఏ డిప్యూటీ స్తపతి మోతిలాల్‌ను ఈఓ అడ్డుకున్నాడు. దీంతో ఆ డిప్యూటీ స్తపతి అవమానంతో వెనుదిరిగాల్సి వచ్చింది. ఇది చూసిన అక్కడి పోలీసు సిబ్బంది, పత్రికా విలేకరులు, దేవాలయ సిబ్బంది ఆశ్చర్యపోయారు. సుమారు ఆరేండ్లపాటు శ్రమించి దేవాలయాన్ని అద్భుతంగా తీర్చిదిద్దిన స్తపతికి అవమానం జరుగడంపై పలువురి నుంచి విమర్శలు వచ్చాయి.కేసీఆర్ పిలుపుతో భారీగా బంగారం విరాళాలు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రాన్ని మాజీ సీఎం కేసీఆర్ రూ. 1300 కోట్ల ప్రభుత్వ ఖజానాతో ఎంతో అద్భుతంగా పునర్నిర్మించారు. సుమారు 21 సార్లు యాదగిరిగుట్టకు వచ్చి స్వామివారి ఆలయాన్ని ప్రత్యక్షంగా పర్యవేక్షించి లోటుపాట్లు లేకుండా నిర్మించాలని స్తపతులు, వైటీడీఏ అధికారులకు సూచించారు. ఈ క్రమంలో స్వామివారి దివ్య విమాన గోపురాన్ని స్వర్ణమయం చేయాలని సంకల్పించారు. ఈ గొప్ప కార్యాన్ని ప్రజలను భాగస్వామ్యం చేయాలని 2020 అక్టోబర్ 19న పిలుపునిచ్చారు. 2021, సెప్టెంబర్ 25 నుంచి ఆలయ అధికారులు బంగారం విరాళాలు సేకరించే పనిలో పడ్డారు. దాంతో పెద్ద ఎత్తున బంగారం విరాళాల రూపంలో, హుండీల ద్వారా వచ్చిన వాటితో స్వర్ణతాడపం పనులు పూర్తి చేశారు.

